ప్రజాశక్తి

గురువారం 2 మార్చి 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

యథేచ్ఛగా ఉల్లంఘనలు

- ఉపాధ్యాయుల సమావేశాల పేరిట ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం
- మొన్న ఆనందపురం, నిన్న పద్మనాభం ఎంఇఒల పిలుపు
- కళ్లుమూసుకుంటున్న ఎన్నికల అధికారులు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార పార్టీ దుర్వినియోగానికి అడ్డూఅదుపూలేకుండా పోతోంది. తమ అధికారాలను అడ్డంపెట్టుకొని అనర్హులను ఓటర్లుగా నమోదుచేసిన దగ్గర నుంచి... ఎన్నికలు సమీపించడంతో ప్రచారం వరకు బరితెగించి వ్యవహరిస్తున్నా ఎన్నికల సంఘంగానీ, ఎన్నికల అధికారులుగానీ కట్టడిచేయడంలేదు. దసపల్లా హోటల్‌లో నిర్వహించిన కెజిబివి ఉద్యోగుల సమావేశంలో వైసిపి అభ్యర్థి సుధాకర్ పాల్గొన్నారు. ఈ వివాదమింకా ముగియకుండానే, ఆంధ్రా యూనివర్శిటీ వైస్‌ఛాన్సలర్ ప్రసాద్‌రెడ్డి మరొకడుగు ముందుకేసి, ప్రయివేటు డిగ్రీ కళాశాలల కరస్పాండెట్లతో ఇదే హోటల్‌లో సమావేశం నిర్వహించారు. ఉత్తరాంధ్ర వైసిపి సమన్వయకర్త వైవి సుబ్బారెడ్డి, వైసిపి విశాఖ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబుతో కలిసి కరస్పాండెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఎయు విసి పాల్గొన్నట్లు బయటపడినా, తాను పాల్గొనలేదని బుకాయించి అధికార పార్టీ అండతో తాత్కాలికంగా తప్పించుకోగలిగారు. ఈ వివాదమిలా నడుస్తుండగానే ఆనందపురం మండల విద్యాశాఖాధికారి పద్మావతి వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి జగనన్న విద్యాకానుక, పాఠ్యపుస్తకాలు, యూనిఫారాల వంటి అకడమిక్ అంశాలపై ఉపాధ్యాయులతో మంగళవారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ

మిగతా 2లో..



ఆనందపురంలో ఉపాధ్యాయులతో సమావేశంలో ఎంఇఒ, ఎమ్మెల్యే (ఫైల్ ఫోటో)

కోడ్ ఉల్లంఘిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

ఎన్నికల నిబంధనలను తరచూ ఉల్లంఘిస్తున్న వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలి. నిబంధనలు ఉల్లంఘనలకు ప్పాడుతున్న వారిపై ఎన్నికల అధికారి చర్య తీసుకోకపోవడం సరికాదు. తక్షణమే జోక్యం చేసుకొని నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన ఎయు విసి, ఆనందపురం ఎంఇఒపై చర్యలు తీసుకోవాలి. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, విద్యా సంస్థల అధిపతులతో సమావేశాలు నిర్వహిస్తున్న విషయం తెలిసినా పట్టించుకోకపోవడం అన్యాయం. ప్రజాస్వామ్య పద్ధతులకు విఘాతం కల్గించే వారికి కొమ్ముకాయడం మంచిదికాదు. ఎన్నికలు సజావుగా, పారదర్శకంగా జరిగేలా చూడాలి.

- కె.లోకనాథం,
సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున, సిపి శ్రీకాంత్ తదితరులు

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు చురుగ్గా ఏర్పాట్లు

- 26 దేశాల నుంచి విచ్చేయనున్న పెట్టుబడిదారులు
- ఎయు మైదానంలో రూపుదిద్దుకుంటున్న ప్రధాన వేదికలు
- ఏపీ పెవిలియన్ పేరుతో 137 స్టాళ్లలో ప్రత్యేక ఎగ్జిబిషన్
- బుధవారం నుంచే రిజస్ట్రేషన్ల ప్రక్రియ

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : ఎయు ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఈ నెల 3, 4 తేదీల్లో జరగనున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. బుధవారం నాటికి ప్రధాన వేదికలన్నింటిలో 90 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన వాటిని పూర్తి చేసేందుకు అధికారులు, సిబ్బంది అహర్నిశలూ శ్రమిస్తున్నారు. గురువారం సాయంత్రం నాటికి అన్ని ప్రధాన వేదికలూ అందుబాటులోకి వచ్చేస్తాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పేర్కొన్నారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహణలో భాగంగా రూ.100 కోట్లతో నగరంలోని రోడ్లను సుందరీకరిస్తున్నామని వెల్లడించారు.

26 దేశాల నుంచి అతిరథ మహారథులు

సదస్సుకు 26 దేశాల నుంచి అతిథులు, పెట్టుబడిదారులు విచ్చేస్తున్నారు. ఈ మేరకు నగరంలో ఉన్న పలు హోటళ్లలో 750 పై చిలుకు గదులను ఇప్పటికే

మిగతా 2లో..

ఇఎస్ఐలో వైద్యసేవలు మృగ్యం

వార్త 4లో..

మూతలు తీశారు.. వేయడం మరిచారు...

వార్త 3లో..

గ్యాస్ ధరల పెంపుపై వామపక్షాల నిరసనలు

వార్త 8లో..

ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపికి ఓట్లు అడిగే హక్కు లేదు

టిడిపి పోలిట్ బ్యూరో సభ్యుడు బొండా ఉమా మహేశ్వరరావు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : పట్టభద్రులు, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు అడిగే నైతిక హక్కు లేదు అధికార వైసిపికి లేదని టిడిపి పోలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. విశాఖలోని టిడిపి కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నాలుగేళ్లలో రాష్ట్రానికి, ప్రత్యేకించి ఉత్తరాంధ్రకు వైసిపి ఏమి చేసిందని ఓటర్లు ప్రశ్నించాలన్నారు. 2020 జనవరి 24న శాసనసభలో శాసన మండలి రద్దు అని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారని గుర్తుచేశారు. అటువంటప్పుడు శాసన మండలికి పోటీ చేసే నైతిక హక్కు, ఓటు అడిగే హక్కు వైసీపీకి ఎక్కడ ఉందని ప్రశ్నించారు. జగన్‌కి ఓటమి భయం పట్టుకుందని, మంత్రులు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, సీదరి అప్పలరాజు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల కాళ్లకు మొక్కుతున్నారని ఎద్దేవా చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ఐకాన్‌గా ఉన్న ఆంధ్ర యూనివర్సిటీని విసి ప్రసాదరెడ్డి వైసిపి కార్యాలయంగా మార్చేశారని ఆరోపించారు. ఎయు విసి ప్రసాదరెడ్డి, రాయలసీమలో ఆర్‌జెడి ప్రతాప్‌రెడ్డి విద్యా సంస్థల నిర్వాహకులను, విద్యార్థులను బెదిరిస్తున్నారని తెలిపారు.

వైసిపి హయాంలో లులు గ్రూప్, ఫ్రాంక్లిన్ టెంపుల్ టెన్, టైటాన్ ఎలక్ట్రానిక్స్, ఆధాని డేటా సెంటర్, ఫింటెక్ వలీ, మిలీనియం టవర్స్ వెనక్కి వెళ్లాయని విమర్శించారు. పరిపాలన రాజధాని అని చెప్పి రూ.వేల కోట్ల విలువైన ఆశ్రమం భూములు, దసపల్లా భూములు, బే పార్క్ భూములను విజయసాయిరెడ్డి దోచేశారని ఆరోపించారు. 22ఎ కింద ఉన్న రూ.40 వేల కోట్లు విలువైన భూములను వైసిపి నాయకులు కొట్టేశారన్నారు.

చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా ఉత్తరాంధ్రలో సాగు నీటి ప్రాజెక్టులకు రూ.18 వేల కోట్లు ఖర్చు చేసి 60 వేల ఎకరాలకు సాగునీరు అందించారని చెప్పారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక సాగునీటిపై ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదన్నారు. స్టీల్‌ప్లాంట్, ప్రత్యేక హోదాపై

మిగతా 2లో..



గ్యాస్ భారం రూ.4 కోట్లు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ

నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలతో సతమతమవుతున్న కుటుంబాలపై కేంద్రం తాజాగా మళ్లీ గ్యాస్ భారం మోపింది. పెంచిన గ్యాస్ ధరలు బుధవారం నుంచి అమల్లోకి వచ్చినట్లు చమురు సంస్థలు ప్రకటించాయి. వంటగ్యాస్ సిలిండర్‌పై రూ.50, వాణిజ్య సిలిండర్‌పై రూ.350.50 పెంచడంతో ఉమ్మడి విశాఖ జిల్లాలో 8.20 లక్షల మంది వినియోగదారులపై నెలకు రూ.4 కోట్ల అదనపు భారం పడింది. ఈ ధరల ప్రకారం ఏడాది భారం రూ.48 కోట్లు ఉంటుంది. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో 14.2 కిలోల గ్యాస్ వినియోగదారులు 13,67,486 మంది ఉన్నారు. వీరిలో ప్రతి నెల బుక్ చేసుకునేవారు 8.20 లక్షల మంది ఉంటారు. ప్రస్తుత గ్యాస్ ధర రూ.1061 నుంచి రూ.1111కి పెరిగింది. విశాఖపట్నం జిల్లాలో హెచ్‌పిసిఎల్, బిపిసిఎల్, ఐఒసి తదితర కంపెనీల గ్యాస్ కనెక్షన్లు 13.67 లక్షలున్నాయి. గ్రామీణ ప్రాంతంలో సిలిండర్ వినియోగం తక్కువ. గ్రామీణ ప్రాంతంలో మూడు నుంచి నాలుగు నెలలకు ఒకసారి గ్యాస్ తీసుకుంటారు. ప్రతినెలా తీసుకొనే గ్యాస్ వినియోగదారులు 8.20 లక్షల మందిపై పెంచిన యాభై రూపాయల ప్రకారం నెలకు రూ.4 కోట్లు భారం పడుతుంది. గ్యాస్ డెలివరీ బాయ్‌కి ఇచ్చినది కాకుండా ప్రస్తుతం రూ.1061 చెల్లిస్తున్న వినియోగదారుడు ఇక నుంచి రూ.1111 చెల్లించాల్సి ఉంటుంది.

గ్యాస్ సబ్సిడీని (నగదు బదిలీ కింద) నేరుగా వినియోగదారుని ఖాతాల్లో జమచేస్తామని ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం రెండేళ్లుగా పెంచిన ధర ప్రకారం రాయితీ ధర పెంచి వినియోగదారునికి చెల్లించడంలేదు. వినియోగదారుని ఖాతాల్లో కేవలం రూ.3.95 మాత్రం వేసి చేతులు దులుపుకుంటోంది. పెంచుతున్న ధరలకు అనుగుణంగా రాయితీ పెంచకపోవడంతో భారమంతా వినియోగదారునిపైనే

మిగతా 2లో..

2020 జూన్ నుంచి పెరిగిన గ్యాస్ ధరలు ఇలా..

2020 జూన్ రూ.600
2020 నవంబరు రూ.620
2020 డిసెంబరు రూ.702
2021 ఫిబ్రవరి రూ.727
2021 మే రూ.830
2021 జులై రూ.843
2021 సెప్టెంబరు రూ.893
2022 జనవరి రూ.908
2022 మార్చి రూ.958
2022 మే 5 రూ.1008
2022 ఆగ్టు రూ.1061
2023 మార్చి రూ.1111

మొదటి పేజీ తరువాయి..

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు చురుగ్గా ఏర్పాట్లు

కేటాయించారు. ఇవి కాకుండా మరో వెయ్యి వరకు ప్రయివేటుగా కొంతమంది గదులను బుక్ చేసుకున్నారు.

ప్రారంభమైన రిజిస్ట్రేషన్ ప్రక్రియ

కళాశాల మైదానంలో పెట్టుబడిదారులు వచ్చే మెయిన్ ప్రవేశ ద్వారం వద్ద రిజిస్ట్రేషన్ కౌంటర్ ఏర్పాటుచేశారు. 40 డెస్కులను ఏర్పాటు చేశారు. అందుకు తగ్గ నోడల్ అధికారులను, సిబ్బందిని కేటాయించారు. ఈ మేరకు బుధవారం నుంచే రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించినట్లు పరిశ్రమల శాఖ ఈడీ చెప్పారు.

ఎపి పెవిలియన్ పేరుతో ప్రత్యేక ఎగ్జిబిషన్

ముఖ్యమంత్రికి కేటాయించిన ప్రత్యేక వేదికకు సమీపంలో ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో మద్దిలపాలెం వైపు సుమారు 137 స్టాళ్లతో ప్రత్యేక ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నారు.

నాలుగు చర్చావేదికల్లో సదస్సులు
పదిహేను అంశాల్లో సెమినార్‌లు

నగరంలోని ఎయు ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఈ నెల 3, 4 తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో రెండు రోజులపాటు వివిధ అంశాలపై సదస్సులు నిర్వహించనున్నారు. వీటికోసం ప్రధాన వేదికతో పాటు దీనికి అనుబంధంగా సెమినార్ల నిర్వహణ కోసం ఒక ప్రత్యేక వేదికను ఏర్పాటుచేశారు. ప్రధాన వేదికలో ప్రారంభోత్సవ, ముగింపు కార్యక్రమాలు, పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలపై సంతకాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. మీడియా హాల్‌లో వివిధ దేశాలకు చెందిన రాయబారులు, ఆయా దేశాలకు చెందిన ప్రతినిధులతో మన రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలపై సెమినార్లు నిర్వహిస్తారు.

తొలిరోజైన ఈ నెల 3వ తేదీన సెమినార్ హాలు -1 లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఆటోమోటివ్, ఎలక్ట్రిక్ మొబిలిటీ, ఎలక్ట్రానిక్స్ తదితర అంశాల్లో సదస్సులు జరుగుతాయి. సెమినార్ హాలు నెంబరు - 2లో ఇండస్ట్రియల్ లాజిస్టిక్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, స్టార్టప్స్ అండ్ ఇన్నోవేషన్, అగ్రికల్చర్, ఫుడ్ ప్రాసెసింగ్ తదితర అంశాలపై సదస్సులు ఉంటాయి. సెమినార్ హాలు నెంబరు -3 లో రెన్యూవబుల్ ఎనర్జీ అండ్ గ్రీన్ హైడ్రోజన్, హెల్త్‌కేర్ అండ్ మెడికల్ ఎక్విప్‌మెంట్, ఏరో స్పేస్ అండ్ డిఫెన్స్ అంశాలపై సదస్సులు నిర్వహిస్తారు

రెండో రోజైన 4వ తేదీన హాలు నెంబరు -1లో పెట్రోలియం అండ్ పెట్రో కెమికల్స్, స్కిల్ డెవలప్ మెంట్ తదితర అంశాల్లో సదస్సులు ఉంటాయి. హాలు నెంబరు -2 లో ఉన్నత విద్య, టెక్స్‌టైల్స్ అండ్ ఏప్పరెల్స్ తదితర అంశాల్లో సదస్సులు జరుగుతాయి. హాలు నెంబరు - 3లో టూరిజం అండ్ హాస్పిటాలిటీ, ఫార్మాస్యూటికల్స్, లైఫ్ సైన్సెస్ అంశాల్లో సదస్సులు నిర్వహిస్తారు. వీటితోపాటు మీడియా హాలులో తొలిరోజు నెదర్లాండ్స్, యుఎఇ దేశాల సదస్సులు జరుగుతాయి. రెండో రోజు వియత్నాం, వెస్ట్రన్ ఆస్ట్రేలియా దేశాల సదస్సులు జరుగుతాయి. ఈ సదస్సులన్నీ ఆయా సెమినార్ హాల్స్‌లో తొలిరోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగనున్నాయి. రెండో రోజు ఉదయం 9 నుంచి 10:30 గంటల వరకు సదస్సులు జరుగుతాయి. సదస్సు తొలిరోజు సాయంత్రం 6 గంటల నుంచి ఆయా వేదికల్లో సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ 3వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రారంభమై రెండో రోజు మధ్యాహ్నం 1:00 గంటతో ముగియనుంది.

మొదటి పేజీ తరువాయి..

యథేచ్ఛగా ఉల్లంఘనలు

సమావేశానికి సహచరులతో వచ్చిన భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలని మాట్లాడారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగులతో సమావేశం నిర్వహించి, ఈ సమావేశాల్లో ఎమ్మెల్యేలు, అధికార పార్టీ నాయకులు మాట్లాడ్డం కొనసాగుతూనేవుంది. ఈ విషయాలన్నీ వెలుగుచూస్తున్నా అధికారులు కనీసం చలించడంలేదు. అధికార పార్టీకి అత్యంత సన్నిహితులుగా ముద్రపడిన అధికారులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. పద్మనాభం మండలంలోని ఉపాధ్యాయులు, ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కూడా ఎమ్మెల్యే శ్రీనివాసరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. మధ్యాహ్నం 3.30 గంటలకు గోస్తనీ విద్యాపీఠ్ పాఠశాలలో నిర్వహించే సమావేశానికి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు హాజరుకావాలని పద్మనాభం మండల విద్యాశాఖాధికారి ప్రధానోపాధ్యాయులకు సమాచారం పంపించారు. ఎమ్మెల్సీ ఎన్నికల సమావేశమంటే రారని, విద్యాశాఖకు సంబంధించిన అంశాలను అజెండాగా పంపించి ఉపాధ్యాయులు వచ్చేలా చేశారు. అధికార పార్టీ ఏజెంట్లలా పనిచేస్తున్న కొంతమంది అధికారులను ఉపయోగించుకొని అధికారిక సమావేశాల పేరిట ఉద్యోగులను పిలిపించి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న విషయం వెలుగుచూస్తున్నా, ఎన్నికల అధికారులు మాత్రం కళ్లుమూసుకుంటున్నారు. శృతిమించుతున్న అధికార పార్టీ ఆగడాలకు నియంత్రించలేని అచేతన స్థితిలో అధికారయంత్రాంగం ఉండడంతో ఎన్నికల నిబంధనలను పక్కనబెట్టేసి, తమకు నచ్చినట్లు ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడుతున్న వారిపై చర్యలుతీసుకోవాలని ఎన్నికల కమిషన్‌కు, ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఉత్తరాంధ్ర అభివృద్ధివేదిక, ప్రజాసంఘాలు ఫిర్యాదులచేసినా ఇంతవరకు చర్యలు తీసుకోలేదు.

గ్యాస్ భారం రూ.4 కోట్లు

పడుతోంది. 2020 జూన్ నాటికి రూ.600 ఉన్న గ్యాస్ ధర తాజాగా రూ.1111 కి చేరింది.

వాణిజ్య సిలిండర్‌పైనా భారీ పెంపు

గృహ వినియోగ సిలిండర్‌తో పాటు వాణిజ్య అవసరాలకు ఉపయోగించే 19 కిలోల సిలిండర్ ధరను ఒకేసారి రూ.350 పెంచారు. వాణిజ్య సిలిండర్ ధర పెరగడంతో చిన్న పెద్ద హోటల్లో తినుబండార ధరలు బాగా పెరిగే అవకాశముంది. పెరిగిన ధరలపై వామపక్షాలు బగ్గుమన్నాయి. గ్యాస్ ధరలు పెంపును నిరసిస్తూ నగరంలో ఆందోళన చేపట్టాయి.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపికి ఓట్లు అడిగే హక్కు లేదు

ముఖ్యమంత్రి జగన్ నోరు మెదపడం లేదన్నారు. ప్రధాని మోడీని ఒక్కసారి అయిననా వీటిపై జగన్ కలిసారా అని ప్రశ్నించారు. తన సిబిఐ కేసులు, వివేకానందరెడ్డి హత్యకేసులో అవినాష్ రెడ్డిని కాపాడేందుకు మాత్రమే ఢిల్లీ వెళ్తున్నారని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో టిడిపి విశాఖ పార్లమెంట్ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి బండారు అప్పల నాయుడు, పార్లమెంట్ క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు ఊరుకుటి డేవిడ్ పాల్గొన్నారు.

ఆంధ్రుల హక్కును కాల రాస్తే సహించం

ప్రజాశక్తి- కలెక్టరేట్, విశాఖ : విశాఖ ఉక్కు- ఆంధ్రుల హక్కు అని, దానిని కాలరాసే అధికారం కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి లేదని సిఐటియుఐ ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.లక్ష్మి అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కార్మిక సంఘాల జెఎసి చేపట్టిన దీక్షలు బుధవారం నాటికి 699వ రోజుకు చేరాయి. దీక్షల్లో మత్స్యకార మహిళలు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎన్నో పోరాటాలు, త్యాగాలు ఫలితంగా ప్రభుత్వ రంగంలో విశాఖ స్టీల్ ప్లాంట్ ఏర్పాటైందన్నారు. అప్పట్లో కేంద్రం రూ.5 వేల కోట్లు మాత్రమే ఇచ్చిందని తెలిపారు.

కార్మికుల శ్రమతో వచ్చిన లాభాలతో, బ్యాంకు నుంచి అప్పు తెచ్చి ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచినట్లు చెప్పారు. ఈ కర్మాగారానికి సొంత గనులు కేటాయించకుండా, ఇతర సహకారం కేంద్రం అందివ్వకుండా, అనేక ప్రతిబంధకాలు కల్పిస్తూ వస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎం.లక్ష్మి, జి.దుర్గ, యు.రమ్య, ఎం.రమ, బాలు, రఘు, రిటైర్డ్ ప్రొఫెసర్ సూరప్పడు పాల్గొన్నారు.

కుల దురహంకారుల చేతిలో ప్రీతినాయక్ బలి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ

కుల దురహంకారంతో ఉన్నత చదువులు చదువుకున్న మూర్ఖుల చేతిలో డాక్టర్ ప్రీతి నాయక్ బలి అయ్యారని అఖిల భారత గిరిజన ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కోరాబు సత్యనారాయణ ఆరోపించారు. డాక్టర్ ప్రీతినాయక్ మృతికి సంతాపంగా బుధవారం సాయంత్రం ఎల్ఐసి దరి అంబేద్కర్ విగ్రహం వద్ద అసోసియేషన్ ఆధ్వర్యాన కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డాక్టర్ ప్రీతినాయక్ మరణానికి బాధ్యులైన సీనియర్స్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్పల సాంబమూర్తి, రూడ సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

మూతలు తీశారు.. వేయడం మరిచారు...

- నెలరోజులుగా నోళ్లు తెరిచి ఉన్న మ్యాన్‌హోల్స్!
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు
- నిర్లక్ష్యపూరిత జివిఎంసి తీరుపై వెల్లువెత్తుతున్న ఆగ్రహం

ప్రజాశక్తి -గాజువాక :అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల్లో భాగంగా రోడ్డు మధ్యలో ఉన్న మ్యాన్‌హోల్స్ మూతలు తీసిన జివిఎంసి యంత్రాంగం రోజుల తరబడి అలాగే వదిలేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు మధ్యలో నోళ్లు తెరిచేలా ఉన్న నిలువెత్తు డ్రైనేజీ గోతుల్లో ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారుల నిర్లక్ష్య వైఖరిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జివిఎంసి గాజువాక జోన్ 70వ వార్డు దత్తసాయినగర్‌లో ప్రమాదభరితంగా ఉన్న డ్రైనేజీ గోతులపై ప్రత్యేక కథనం.

70వ వార్డు పరిధి దత్తసాయినగర్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి ఇంటింటికి కనెక్షన్ ఇచ్చేందుకు జివిఎంసి గాజువాక జోన్ ఇంజినీరింగ్, యుజిడి అధికారులు పెద్ద పెద్ద గోతులు తవ్వి నెలరోజులుగా వదిలేశారు. గోతులు, యుజిడి మ్యాన్‌హోల్స్‌పై మూతలు తీసిన అధికారులు, తర్వాత పూడ్చే పని తమది కాదంటూ వదిలేశారు. ఆయా గోతుల వద్ద సిమెంట్ పనులు గానీ, తెరిచిన మ్యాన్‌హోల్స్‌ను మూసే పనులు గానీ చేపట్టకపోవడంతో ఇపుడా గోతులు ప్రమాదభరితంగా మారాయి. ఇరుకు రోడ్డులో మధ్యలో గోతులు ఉండడంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పగటిపూటైనా ఏమాత్రం ఆదమరిచి వెళితే గోతుల్లో పడడం గాయాల పాలుకావడం ఖాయం. రాత్రివేళల్లో ఇక్కడ పొంచి ఉన్న ప్రమాదంపై స్థానికులు ఆందోళన చెందుతున్నారు. నిత్యం ఇక్కడ సంచరిస్తుండడంతో అవగాహన ఉన్నప్పటికీ అనేకమార్లు ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయని స్థానికులు అంటున్నారు. ఇక వృద్ధులు, చిన్నపిల్లల సంగతి వేరే చెప్పనక్కరలేదు. ప్రజలప్రాణాలకు ముప్పు వాటిల్లే పరిస్థితులు ఉన్నప్పటికీ సంబంధిత జివిఎంసి అధికారుల నిర్లక్ష్యవైఖరిపై స్థానికులు నిప్పులు చెరుగుతున్నారు. ఇప్పటికైనాసంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

రోడ్లు వేస్తున్నారు.. తవ్వేస్తున్నారు...

ఇదిలా ఉంటే సిఎంఆర్ జంక్షన్ నుండి చైతన్యనగర్ వరకు నెల రోజుల క్రితం రూ.15 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టారు. ఇంతలో ఏమైందేమో గానీ, వేసిన రోడ్డును మళ్లీ తవ్వేస్తున్నారు. రోడ్లు వేసేటప్పుడు, ఇలా తవ్వేటప్పుడు జరుగుతున్న పనుల వల్ల ప్రజాధనం వృథా, దుర్వినియోగమే కాకుండా అదే పనిగా చేపడుతున్న పనులు వల్ల ఈ ప్రాంత వాసులు అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారుల కనీసం ముందుచూపు లేని నిర్లక్ష్యభరిత పనుల వల్లే ఇదంతా జరుగుతోందని స్థానికులతోపాటు సిపిఎం, ప్రజాసంఘాల నేతలు మండిపడుతున్నారు. దీనిపై జివిఎంసి గాజువాక జోన్ ఇఇ ప్రసాదుబాబు వివరణ కోరగా, సిఎంఆర్ జంక్షన్ నుండి చైతన్యనగర్ వరకు పైపులైన్ ఏర్పాటుకు గోతులు తవ్వుతున్నామన్నారు. తవ్విన గోతుల స్థానే అభివృద్ధి పనులు చేపడుతామంటున్నారు.



రోడ్డు మధ్యలో నెలరోజులుగా మూతపెట్టని మ్యాన్‌హోల్

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి - ఆరిలోవ : డాక్టర్ సి.వి.రామన్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆరిలోవ బారతీ ఇంగ్లీషు మీడియం స్కూల్లో బుధవారం విద్యార్థుల వైజ్ఞానిక నమూనాల ప్రదర్శన అందరిని ఆకట్టుకోవడంతో పాటు ఆలోచింపజేసింది. పాఠశాల అధినేత ఎం.వి.రావు పాల్గొని ముందుగా డాక్టర్ సి.వి.రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పాఠశాల సిబ్బంధి, తల్లిదండ్రులతో కలిసి విద్యార్థులు తయారుచేసిన సుమారు వంద సైన్స్ నమూనాలను పరిశీలించి, విద్యార్థుల ప్రతిభను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు మల్లేశ్వరి, శర్మ, అఖిల తదితరులు పాల్గొన్నారు.

కల్యాణోత్సవం, చందనోత్సవంపై సమీక్ష

ప్రజాశక్తి-సింహాచలం: సింహాచల దేవస్థానానికి చెందిన కృష్ణాపురం గోశాలలో బుధవారం సింహాచల దేవస్థానం ట్రస్ట్ బోర్డు సమావేశం జరిగింది. ఎన్నికల నిబంధన ఉండడంతో సమావేశానికి ఏ ఒక్కరినీ ఆహ్వానించలేదు. సమావేశంలో ముఖ్యంగా వచ్చే నెల 2న జరగనున్న స్వామి కల్యాణోత్సవం, 23న జరగనున్న చందనోత్సవం ఏర్పాట్లపైనా, భక్తులకు కల్పించే సౌకర్యాలపైనా ట్రస్ట్‌బోర్డు సభ్యులు చర్చించారు. సమావేశంలో ట్రస్ట్ బోర్డ్ చైర్మన్, సభ్యులు, ఇఒ వి.త్రినాథరావు, దేవస్థానం అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గ్లోబల్ ఇన్వెస్టర్ల సమ్మిట్ ఏర్పాట్లపై సమీక్ష



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రులు అమర్, బుగ్గన

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ - 2023 కు సంబంధించి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, నగర పోలీసు కమిషనర్ సిహెచ్ శ్రీకాంత్, ఇతర అధికారులతో బుధవారం ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా విమానాశ్రయం నుంచి బయలుదేరి ఎన్ఏడి మీదుగా తాటిచెట్లపాలెం, తెలుగుతల్లి బ్రిడ్జ్ మీదుగా గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు నిర్వహించనున్న ఎయు మైదానానికి చేరుకున్నారు. అక్కడ ఏర్పాట్లను పరిశీలించి ఆయన సిపితో చర్చించి అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. అక్కడ నుంచి అతిథులు బస చేసే రాడిసన్ బ్లూ హోటల్‌ను పరిశీలించి ఏర్పాట్లపై పోలీసు కమిషనర్‌తో చర్చించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కెఎస్ విశ్వనాథన్, ఆర్డీఓ హుస్సేన్ సాహెబ్, పోలీసు అధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఏర్పాట్లను అమర్‌నాథ్ పరిశీలన

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు సంబంధించి ఆంధ్ర యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల గ్రౌండ్లో జరుగుతున్న ఏర్పాట్లను బుధవారం మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 3, 4 తేదీలలో జరగనున్న పారిశ్రామిక సదస్సుకు ఇప్పటివరకు 25 ప్రత్యేక విమానాలు విశాఖకు రాబోతు న్నాయన్న సమాచారం అందిందని, 18 విమానాలను విశాఖ ఎయిర్ పోర్టులో పార్క్ చేసే అవకాశం ఉందని, మిగిలిన విమానాలు రాజమండ్రి, విజయవాడ ప్రాంతాలకు తరలించనున్నామని చెప్పారు. విశాఖకు తరలివస్తున్న ప్రముఖుల్లో అంబానీ, కరణ్ అదాని, కుమార్ మంగళం బిర్లా తదితరులు ఉన్నారని తెలియజేశారు. ఈ సదస్సులో రెన్యువబుల్ ఎనర్జీ రంగంలో అత్యధిక పెట్టుబడులు వచ్చే అవకాశముందని తెలిపారు.

నేడు ముఖ్యమంత్రి రాక

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గురువారం రాత్రి 8 గంటలకు విశాఖపట్నం చేరుకుంటారని అమర్‌నాథ్ తెలిపారు. 3వ తేదీ ఉదయం ఆయన వేదిక వద్దకు వచ్చి, ఎగ్జిబిషన్‌ను తిలకిస్తారని, అనంతరం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రసంగిస్తారన్నారు. తొలిరోజు కొన్ని ఎంఒయులు జరుగుతాయని వివరించారు. ఏర్పాట్లను ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి బుధవారం పరిశీలించారు.

మూడు రోజులు విశాఖలోనే

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు విశాఖ వచ్చే ముఖ్యమంత్రి ఈ నెల 2వ తేదీ నుంచి 4వ తేదీ మధ్యాహ్నం వరకూ విశాఖలోనే బస చేయనున్నారు. ముఖ్యమంత్రి పర్యటన వివరాలను అదనపు వ్యక్తిగత కార్యదర్శి కె.నాగేశ్వరరెడ్డి విడుదల చేశారు. షెడ్యూల్ ప్రకారం 2వ తేది సాయంత్రం 4 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి 5.15 గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు. అనంతరం రుషికొండలోని రాడిసన్ బ్లూ హోటల్‌లో రాత్రికి బస చేస్తారు. 3వ తేది ఉదయం 8:50 గంటలకు హోటల్ నుంచి బయలుదేరి ఉదయం 9.10 గంటలకు ఏయూ ఇంజినీరింగ్ కాలేజ్ గ్రౌండ్స్‌కు చేరుకుని గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో పాల్గొంటారు. రాత్రి 8.00 నుంచి 9.00 గంటల మధ్య ఎంజీఎం పార్క్ హోటల్‌లో జిఐఎస్ డెలిగేట్స్‌కు ఏర్పాటుచేసిన ప్రత్యేక విందు కార్యక్రమంలో పాల్గొంటారు. రాత్రికి రాడిసన్ బ్లూ హోటల్‌లో బస చేస్తారు. 4వ తేదీ ఉదయం 9.10 గంటలకు సదస్సు ప్రాంతానికి చేరుకొని సమ్మిట్‌లో పాల్గొంటారు. మధ్యాహ్నం 2 గంటలకు విశాఖ నుంచి బయలుదేరి 3.40 గంటలకు తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు

సమ్మిట్‌తో విశాఖ ఖ్యాతి విశ్వవిఖ్యాతం

ఎంవిపి కాలనీ : గ్లోబల్ ఇన్వెస్టర్ల సమ్మిట్‌తో విశాఖ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పబోతున్నామని నెడ్ కేప్ చైర్మన్ కెకె.రాజు తెలిపారు. వైసిపి నగర కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖపట్నం రాజధానిగా మారడానికి అన్ని లక్షణాలను కలిగి ఉందన్నారు.

రైతుల అభ్యంతరంతో గ్రామసభ రద్దు



స్థలాల కేటాయింపుపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్న నిర్వాసిత రైతులు

ప్రజాశక్తి-పద్మనాభం : ల్యాండ్ పూలింగ్‌కు భూములిచ్చిన రైతులకు ఇళ్లస్థలాల కేటాయింపు సమస్యను పరిష్కరించేందుకు బుధవారం నిర్వహించిన గ్రామసభ రైతులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో రద్దు చేశారు. సంబంధిత రెవెన్యూ అధికారులు గ్రామసభ నిర్వహణకు సన్నద్ధమైనప్పటికీ, రైతుల నుంచి వ్యతిరేకత వ్యక్తం కావడంతో సభను నిర్వహించకుండానే రద్దు చేసి, అధికారులు వెనుదిరిగారు. ల్యాండ్‌పూలింగ్‌కు భూములిచ్చిన నిర్వాసిత రైతుల కంటే, స్థానిక ప్రజాప్రతినిధులకు, వారి అనుయాయులు, అనుచరులకు ప్రధాన రోడ్డు పక్కనే విలువైన స్థలం ఇవ్వడంపై నిర్వాసిత రైతుల నుంచి అభ్యంతరం వ్యక్తమైంది. వివరాల్లోకి వెళితే..

మండలంలోని తునివలస పంచాయతీ, నర్సాపురం గ్రామానికి చెందిన కొంతమంది రైతులు ప్రభుత్వం, అధికారుల విజ్ఞప్తి మేరకు ల్యాండ్‌పూలింగ్ ద్వారా సుమారు రెండొందల ఎకరాలను మూడేళ్ల క్రితం స్వచ్ఛందంగా ఇచ్చారు. అప్పట్లో కుదిరిన ఒప్పందం మేరకు నిర్వాసితులకు స్థలాలను కేటాయించాల్సి ఉండగా, నేరేళ్లవలస పంచాయతీ 102 సర్వేనెంబర్‌లో సుమారు 3 ఎకరాల భూమిలో లేఅవుట్లు వేసి అప్పగించారు. అయితే ఈ లేఅవుట్‌ను నిర్వాసిత రైతుల్లోని 22 మంది వ్యతిరేకించారు. దీనిపై బుధవారం సమావేశం నిర్వహించి, లాటరీ పద్ధతిలో ఆయా రైతులకు స్థలాలను కేటాయించాలని అధికారులు భావించినప్పటికీ,లాటరీ విధానాన్ని కూడా వారంతా వ్యతిరేకించారు. ఇదే 102 సర్వే నెంబర్‌లో పద్మనాభం నుంచి విజయనగరం పోవు రోడ్డుకు అనుకుని ఉన్న విలువైన భూమిని స్థానిక ప్రజాప్రతినిధులు, వారి కుటుంబాలకు కేటాయించిన అధికారులు, భూనిర్వాసితులైన తమకు వేరేవైపున ఇళ్లస్థలాలను ఇవ్వడం దారుణమని ఆరోపించారు. భూములివ్వని వారికి రోడ్డుపక్కన స్థలాలిచ్చి, తమకు అంతగా ప్రాధాన్యత లేని వాటిని ఇవ్వడమేంటని ప్రశ్నించారు. ముందుగా వారికిచ్చిన స్థలాల కేటాయింపును కూడా రద్దు చేసి, తర్వాత అందరికీ ఆమోదయోగ్యంగా పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ కె వేణుగోపాల్, డిప్యూటీ తహశీల్దార్ కిషోర్ పాల్గొన్నారు.

మెడికో ప్రీతి మృతికి కారకులను శిక్షించాలి

స్టీల్ తెలంగాణ ఉద్యోగుల సంఘం నిరసన



ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న స్టీల్ తెలంగాణ ఉద్యోగులు

ప్రజాశక్తి-ఉక్కునగరం : డాక్టర్ ప్రీతి మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని స్టీల్‌ప్లాంట్ తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. బుధవారం ఎల్అండ్‌డిసి వద్ద సంఘం ప్రతినిధులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి జి.ఆనంద్ మాట్లాడుతూ కాకతీయ మెడికల్ కాలేజీలో ఎనస్తీసియన్‌గా పోస్టుగ్రాడ్యుయేషన్ చేస్తున్న డాక్టర్ డి.ప్రీతినాయక్ సీనియర్ డాక్టర్ వేధింపులకు బలైందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రీతి మృతిపై సమగ్ర దర్యాప్తు జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసారు. నిరసన ప్రదర్శనలో ఉక్కు సిఐటియు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, యూజ్ ప్రధాన కార్యదర్శి కె.పరంధామయ్య, ఉక్కు అధికారులు ఎన్.వీరేశం, బత్తుల శ్రీనివాస్, ఆర్. నర్సింహ పాల్గొని సంఘీభావం ప్రకటించారు. కార్యరకమంలో సంఘం ప్రతినిధులు బి.వెంకటేశ్వర్లు, ఎన్. నర్సింగరావు, ఎం.లక్ష్మణ్, కోటేష్ నాయక్, రాములు, తిరుపతి నాయక్ పాల్గొన్నారు.

రైల్వే సంబంధిత సమస్యలపై వినతి



డిఆర్ఎమ్‌కు సమస్యలను విన్నవిస్తున్న ఆనంద్‌కుమార్

ప్రజాశక్తి- కంచరపాలెం : పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని రైల్వే సంబంధిత సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం వైసిపి పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనందకుమార్ ఆధ్వర్యంలో కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు బృందంగా వెళ్లి ఈస్ట్‌కోస్ట్ రైల్వే డివిజనల్ మేనేజర్, అసిస్టెంట్ డివిజనల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు.
దీనిపై డిఆర్ఎం అనూప్‌కుమార్ శతపతి స్పందిస్తూ, సంబంధిత సమస్యలపై ఆయా శాఖాధిపతులతో చర్చించి, సత్వరమే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. దీనిపై ఈ నెల 4న క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రతి సమస్యనూ క్షుణ్ణంగా పరిశీలించి, నివేదిక, పరిష్కార చర్యలను సూచించాల్సిందిగా సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలోజివిఎంసి కోఆప్షన్ సభ్యులు బెహరా భాస్కరరావు, కార్పొరేటర్లు ముర్రువాణీ నానాజీ, వార్డు అధ్యక్షులు దొడ్డి కిరణ్, ఆడారి శ్రీనివాసరావు, నమ్మి శ్రీను, మల్ల శ్రీను, రాజు పాల్గొన్నారు

పెద్దిపాలెంలో తనిష్క జ్యూయలరీ



జ్యూయలరీ షాప్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి

ప్రజాశక్తి- అనందపురం : మండలంలోని పెద్దిపాలెం పారడైజ్ హోటల్ పక్కన తనిష్క జ్యూవెలరీ షాప్‌ను స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు బుధవారం ప్రారంభించారు. పెద్దిపాలెం గ్రామానికి చెందిన కూరాకుల మురళీకుమార్ ఏర్పాటుచేసిన ఈ జ్యువలరీ షాపులో అన్ని రకాల బంగారు, వెండి, ఇతర ఆభరణాలు అందుబాటులో ఉంటాయన్నారు. పరిసర ప్రాంతాల ప్రజలు జ్యువలరీ కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా అన్ని రకాల ఆభరణాలు అందుబాటులో ఉంటాయని షాపు యజమాని మురళి తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి కోరాడ వెంకటరావు, ప్రభుత్వ న్యాయ సలహాదారు మరిపిల్లి చిన్నయ పాత్రుడు, నాయకులు బావశెట్టి రాజు, కూరాకుల వెంకటేష్, పోతిన వెంకట అప్పారావు, గుండు నానాజీ పాల్గొన్నారు.

అప్పన్నను సన్నిధిలో ప్రముఖులు

ప్రజాశక్తి- సింహాచలం: సింహాద్రి అప్పన్నను బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఇన్‌కం ట్యాక్స్ కమిషనర్ బాలకృష్ణ దంపతులు, జాయింట్ కమిషనర్ కోటేశ్వరమ్మ, బాబా ఆటమిక్ రీసెర్చి సెంటర్ అనుబంధ హోమీబాబా ట్రస్ట్ చైర్‌పర్సన్, అణుశాస్త్రవేత్త పద్మభూషణ్ డాక్టర్ చిదంబరం దంపతులు దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఇఒ త్రినాథరావు ఆలయ సంప్రదాయ ప్రకారం స్వాగతం పలికారు. ముందుగా కప్పసంబాన్ని ఆలింగనం చేసుకొని, బేడా మండపం చుట్టూ ప్రదక్షిణలు చేసిన తర్వాత స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధిలోను గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించగా,ఇఒ త్రినాథరావు వారికి స్వామి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందించారు.

నిత్యాన్నదానానికి రూ.1.50లక్షల వితరణ

దర్శనం అనంతరం సింహాద్రి అప్పన్న నిత్యాన్నదానానికి అణుశాస్త్రవేత్త ఆర్.చిదంబరం దంపతులు 'మే ఐ హెల్ప్ యు' కార్యాలయంలో పిఆర్ఒ నాయుడుకు రూ. 1.50లక్షల చెక్కును అందజేశారు.

ఇఎస్ఐలో వైద్యసేవలు మృగ్యం

- సిఐటియు ఆధ్వర్యాన జివిఎంసి కాంట్రాక్టు కార్మికుల ధర్నా
- ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణమూర్తికి వినతి



సూపరెంటిండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నేతలు, కార్మికులు

ప్రజాశక్తి -ములగాడ: ఇఎస్ఐ ఆసుపత్రిలో కార్మికులకు మెరుగైన వైద్యసేవలు అందడం లేదని సిఐటియు మల్కాపురం జోన్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి విమర్శించారు. బుధవారం మల్కాపురం దరి ఇఎస్ఐ ఆసుపత్రి వద్ద జివిఎంసి కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్, సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా లక్ష్మణమూర్తి మాట్లాడుతూ జివిఎంసి కార్మికులు తమ వేతనాల నుంచి ప్రతినెలా ఇఎస్ఐ కోసం డబ్బులు చెల్లిస్తున్నా వారికి సరైన వైద్యసేవలు అందకపోవడం దారుణమన్నారు. కార్మికులు వైద్యం కోసం ఇఎస్ఐ ఆసుపత్రికి వెళితే, కెజిహెచ్ లేదా ఇతర ఆసుపత్రులకు రిఫర్ చేసి చేతులు దులుపుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు ఇలాగే ఇటీవల 59వవార్డులోని జివిఎంసి మహిళా కార్మికురాలు కౌవుల లక్ష్మి అనారోగ్యంతో ఇఎస్ఐ ఆసుపత్రికి వెళితే, కెజిహెచ్ లేదా విజయనగరం ఆసుపత్రికి రిఫర్ చేసి చేతులు దులుపుకున్నారని, దీంతో ప్రయివేటు ఆసుపత్రిలో చేరి, రూ.రెండు లక్షల వరకు అప్పుచేసి వైద్యం చేయించుకుందన్నారు అలాగే 60వ వార్డుకు చెందిన కృష్ణ అనే కార్మికుడు కడుపులో కాయ ఉందని ఆసుపత్రికి వెళితే, కెజిహెచ్‌కు రిఫర్ చేస్తే అక్కడికి వెళ్లి ఆపరేషన్ చేయించకున్నారన్నారు. ఇలాగే ఎందరో ఇఎస్ఐ సభ్యత్వం ఉన్న కార్మికులు ఇఎస్ఐ ఆసుపత్రికి వెళ్లడం, అక్కడ అందుతున్న వైద్యం, మందులపై అసంతృప్తితో మళ్లీ ప్రయివేటు ఆసుపత్రులకు పరుగులెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న వైద్యానికి కెజిహెచ్ లేదా ప్రయివేటు ఆసుపత్రులకు రిఫర్ చేస్తే, ఇక ఇఎస్ఐ సభ్యత్వముండి ప్రయోజనమేంటని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఇఎస్ఐ ఆసుపత్రిలో కార్మికులకు అన్ని రకాల వ్యాధులకు అవసరమైన చికిత్స, మందులను ఇఎస్ఐలోఅందుబాటులో ఉంచి వైద్యసేవలను మెరుగుపరిచి కార్మికులకు అండగా నిలవాలని డిమాండ్ చేశారు.అనంతరం ఇఎస్ఐ ఆసుపత్రి సూపరెంటిండెంట్ డాక్టర్ రమణమూర్తికి వినతిపత్రం అందించారు.

కార్యక్రమంలో సిఐటియు జోన్ అధ్యక్షులు కె.పెంటారావు, పిపైడిరాజు, జివిఎంసి మల్కాపురంజోన్ అధ్యక్షుడు కె.రమణ,నాయుకులు బి.రాంబాబు, గంగులు,, డి.రాము, లోకేష్, తిరుపతిరావు, జె. రామారావు, బి శ్రీను, సిహెచ్.లక్ష్మి, అప్పలకొండ, డి.పాప, దుర్గ, లలిత పాల్గొన్నారు.

సరిపడా బడ్జెట్ లేకే ...

కార్మికుల విజ్ఞప్తిపై ఇఎస్ఐ ఆసుపత్రి సూపరెంటిండెంట్ డాక్టర్ రమణమూర్తి స్పందిస్తూ, పదిరోజుల్లో అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచుతామన్నారు. ప్రస్తుతానికి రెండు ప్రైవేట్ ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నామన్నారు. ఆసుపత్రికి తగినంత బడ్జెట్ లేకపోవడం వల్లే వైద్యసేవలు అందించలేక పోతున్నామని, .ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకుని మెడికల్ బిల్లు పెడితే, పరిశీలించి ప్రభుత్వానికి నివేదించి, బిల్లులు వచ్చిన వెంటనే చెల్లిస్తామన్నారు. కార్మికుల సమస్యలను ఇఎస్ఐ డైరెక్టర్‌కు నివేదిస్తామన్నారు. ఏదైనాసమస్య ఉంటే తనను నేరుగా కలిసి తెలియజేయాలని, పరిశీలించి పరిష్కరిస్తానని హామీనిచ్చారు.

విజన్ ఆర్‌టితో కేన్సర్‌కు చికిత్స

ఒమెగా ఆసుపత్రి వైద్యనిపుణులు



సమావేశంలో మాట్లాడుతున్న ఒమేగా ఆసుపత్రి వైద్యులు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఒమెగా ఆసుపత్రిలో విజన్ ఆర్‌టి (సర్ఫేస్ గైడెడ్ సిస్టమ్) ఉపయోగించి రెండు వేల మంది కేన్సర్ రోగులకు విజయవంతంగా చికిత్సను అందించినట్టు ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ రవిశంకర్ తెలిపారు. బుధవారం ఆరిలోవ హెల్త్‌సిటీ ఒమెగా ఆసుపత్రిలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, ప్రపంచస్థాయి సదుపాయాలతో, అత్యంత అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కేన్సర్‌కు చికిత్సను అందించడంలో విశాఖపట్నం ఒమెగా ఆసుపత్రి ఆగ్రగామిగా నిలిచిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎస్‌జిఆర్‌టి విధానాన్ని తొలిసారి అందుబాటులోకి తెచ్చింది ఒమెగా ఆసుపత్రి అన్నారు. సాధారణ విధానం వల్ల కలిగే అసౌకర్యాన్ని, బాధను తగ్గించవచ్చన్నారు. ఈ విధానం ఆర్టిఫిషియన్ ఇంటిలిజెన్స్ ద్వారా పనిచేస్తుందన్నారు. ప్రత్యేమైన వీడియో మోడ్ విధానంలో రోగి కదలికలను గమనిస్తూ చికిత్స అందిస్తామన్నారు. ఈ విధానంలోని 3డి రియలిస్టిక్ ఫొటో క్యాప్చర్ ఫీచర్ వలన ఉప మిల్లీమీటర్ కచ్చితత్వంతో రోగికి చికిత్స చేయవచ్చన్నారు. రొమ్ము కేన్సర్ రోగులలో గుండెపైనా, అలాగే, పిల్లలకు చికిత్సను సజావుగా అందించేందుకు ఇది దోహదపడుతుందని వివరించారు. మెదడులోని చాలా చిన్న కణితులను కూడా స్టీరియోటాక్టిక్ రేడియేషన్ ద్వారా చికిత్స చేయుట సులభమైందన్నారు. సమావేశంలో వైద్యనిపుణులు డాక్టర్ లక్ష్మీనరసింహ, కృష్ణరమేష్, జనరల్ మేనేజర్ సుబ్రహ్మణ్యం, ఆనంద్‌కృష్ణన్ పాల్గొన్నారు.

మొక్కజొన్న సాగు, సస్యరక్షణపై అవగాహన



పొలంబడిలో మొక్కజొన్న పైర్లను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ బృందం

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలంలో పొలంబడి కార్యక్రమంలో భాగంగా బుధవారం దాకమర్రిలో మొక్కజొన్న సాగు, సస్యరక్షణకు చేపడుతున్న చర్యలపై వ్యవసాయశాఖ అధికారుల బృందం క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. విశాఖ డాట్ శాస్త్రవేత్త డాక్టర్ బి భవాని, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బొడ్డేపల్లి విజయప్రసాద్, డిఆర్‌సి, ఎడిఎ, చదువుల సుబ్రమణ్యం, మండల వ్యవసాయ శాఖ అధికారి బి శివకోమలి పరిశీలించారు. ఈసందర్భంగా మొక్కజొన్న పంటకు ఆకు ఎండు తెగులు (లీఫ్ బ్లైట్) ఎక్కువగా సోకినట్లు గుర్తించారు. దీని నివారణకు హెక్సాకొనజోల్ 5ఇసి 400ఎంఎల్, లేదా ప్రోపికొనజోన్ 25ఇసి 200 ఎంఎల్ మందును 200 లీటర్ల నీటిలో కలిపి మందు ద్రావణాన్ని మొక్కజొన్న పైర్లపై పిచికారీ చేయాలని సూచించారు. కత్తెర పురుగు కూడా ఆశించినందున, వీటి నివారణకు కార్బోఫ్యూరాన్ కిలోల గుళికలను ,8 కిలోల ఇసుకతో కలిపి ఆకు సుడులలో వేయాలని సూచించారు. బాగా ఎదిగిన మొక్క జొన్నలో స్పైనొట్రాన్ 5ఎంఎల్ ద్రావణం, లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు.
2023ను అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా పరిగణించిన నేపథ్యంలో ప్రస్తుత రబీలో మొక్కజొన్న పంట కోత తర్వాత, రానున్న ఖరీఫ్ వరి పంటa ముందే రాగి పంటను వేసుకుని అధిక ఆదాయం పొందాలని రైతులకు తెలిపారు. పొలంబడి కార్యక్రమంలో దాకమర్రి విహెచ్ఎ, భాగ్య రేఖ, ఆర్‌బికె వాలంటీర్ సి హెచ్ యోన తది తరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో వైసిపి నేతలు



పింఛన్లు అందజేస్తున్న కెకె.రాజు

ప్రజాశక్తి -సీతమ్మధార: ఉత్తర నియోజకవర్గం పరిధిలోని 14వ వార్డు బిఎస్ లేఅవుట్, 25వ వార్డు గణేష్ నగర్, 46వ వార్డు శాంతినగర్, లక్ష్మీ నారాయణ పురంలలో సామాజిక పింఛన్ల పంపిణీలో వైసిపి నేతలు పాల్గొన్నారు. వాలంటీర్లతోపాటు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో వైసిపి ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ రాష్ట్ర చైర్మన్ కెకె.రాజు పాల్గొని, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, స్టాండింగ్ కమిటీ సభ్యులు సారిపిల్లి గోవింద్, 14 వార్డు కార్పొరేటర్ కె.అనిల్ కుమార్‌రాజుతో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా కె.కె రాజు మాట్లాడుతూ సిఎం జగన్మోహనరెడ్డి పాదయాత్రలో గుర్తించిన కష్టాలు, ఇచ్చిన హామీలకు కట్టుబడి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. సిఎంగా అధికారం చేపట్టిన తర్వాత రూ.మూడు వేలకు పింఛను పెంపుపైనే తొలి సంతకం చేసి, విడతల వారీగా అమలు చేస్తున్నారన్నారు.మెజార్టీ హామీలను అమలు చేసిన ఘనత సిఎం జగన్మోహనరెడ్డిదే అన్నారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్ రాజు, డైరెక్టర్లు నూకరాజు, రాయుడు శ్రీను, బోగవల్లి గోవింద్, బల్లా శ్రీనివాస్, బి.గోవింద్, కె.చిన్నా, సత్యనారాయణ, ప్రవీణ్ వర్మ, సారిపిల్లి సంతోష్, సానబోయిన సురేష్, పోతిబంతి హరి తదితరులు పాల్గొన్నారు.

రామాలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి గాజువాక : జివిఎంసి 74వ వార్డు పాత సిద్ధేశ్వరం గ్రామంలో రామాలయ పునర్నిర్మాణ పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. స్థానిక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, 74వ వార్డు కార్పొరేటర్, వైసిపి సోషల్‌మీడియా జిల్లా కన్వీనర్ తిప్పల వంశీరెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొని శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో విశిష్ట అతిథులుగామాజీ ఎమ్మెల్యేలు తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకటరామయ్య, పల్లా శ్రీనివాసరావు, ఇంటక్ జాతీయ నేత మంత్రి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి

ప్రజాశక్తి-అనకాపల్లి

ఈనెల 13న జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లను పూర్తి చేసినట్టు కలెక్టర్ రవి పఠాన్ శెట్టి తెలిపారు. కలెక్టరేట్ నుంచి బుధవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ ముఖేష్ కుమార్ మీనాతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ గౌతమిశాలితో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘించకుండా ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా బందోబస్తు చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 49 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వాటిలో 44 రెగ్యులర్ కాగా, 5 ఆక్సిలరీ కేంద్రాలని తెలిపారు. 21 సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించామన్నారు. జిల్లాలో మొత్తం ఓటర్లు 42,714 మంది కాగా పురుషులు 28,370, స్త్రీలు 14,338 మంది, ట్రాన్స్ జెండర్ ఆరుగురు ఉన్నారని వెల్లడించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, డిఆర్‌ఓ పి వెంకటరమణ, సిపిఓ రామారావు, జిఎస్‌విఎస్ అధికారి మంజుల వాణి పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి, ఎస్‌పి గౌతమిశాలి, డిఆర్‌ఓ వెంకటరమణ



ధాన్యం, గడ్డి దగ్ధమవుతున్న దృశ్యం

ధాన్యం, గడ్డి దగ్ధం

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట

మండలంలోని పి.భీమవరం గ్రామంలో స్థానిక పాఠశాల సమీపంలో 50 బస్తాల వరి ధాన్యం, రెండు ట్రాక్టర్ల గడ్డి కాలిపోయింది. గ్రామానికి చెందిన పిన్నపోలు చిన్నోడు ఇటీవల తన పంట పొలంలో నూర్చిన ధాన్యాన్ని, గడ్డివాములో పురి కట్టి నిలువ చేశాడు. బుధవారం సాయంత్రం ప్రమాదవశాత్తు నిప్పు అంటుకోవడంతో మంటలు చెలరేగాయి. దీంతో సమీపంలో గలవారు అప్రమత్తమై మంటలు ఆర్పగా 10 బస్తాల వరకు ధాన్యాన్ని కాపాడగలరు. సుమారు యాభై బస్తాల వరకు ధాన్యం, రెండు ట్రాక్టర్ల గడ్డి కాలిపోయిందని రైతు పినపోల్లు చిన్నోడు వాపోయాడు. ఆస్తి నష్టం రూ.70వేలు వరకు ఉంటుందని అంచనా.



ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్‌తో విద్యార్థిని వరహా లక్ష్మీ మోహన

నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంపునకు ఎంపిక

ప్రజాశక్తి-అనకాపల్లి

పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం వైఎన్ కళాశాలలో మార్చి 3 నుంచి 9 వరకు జరిగే నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంపునకు స్థానిక ఎఎంఎఎల్ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీరు లింగాల వరాహ లక్ష్మీ మోహన ఎంపికయ్యారు. ఆంధ్ర యూనివర్సిటీ పరిధిలోని నలుగురు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఎంపిక కాగా అందులో తమ కళాశాలకు చెందిన మోహన ఎంపిక కావడం అభినందనీయమని ప్రిన్సిపల్ డాక్టర్ జి జయ బాబు తెలిపారు. ఈ సందర్భంగా మోహనను ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కెవిఎస్ మహేశ్వర రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం హరిబాబు, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

విద్యా హక్కు చట్టంపై 5న రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : పేద బాలలకు ప్రయివేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలలో మొదటి తరగతిలో 25 శాతం ఉచిత సీట్లపై అవగాహన, సూచనల కోసం ఈ నెల 5వ తేదీన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు బాల వికాస్ ఫౌండేషన్ ప్రతినిధి నరవ ప్రకాశరావు తెలిపారు. ఈ సమావేశానికి ఆచార్య వై.సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ, ఆచార్య వి.బాలమోహన్‌దాస్ తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు.

నిరుపేదకు జెడ్‌పిటిసి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి- కె.కోటపాడు

మండలంలోని చౌటువాడ గ్రామానికి చెందిన నిరుపేద చిన్ని సన్నమ్మకు జెడ్‌పిటిసి ఈర్లె అనురాధ బుధవారం ఆర్థిక సాయం అందజేశారు. పేదలైన వరహాలమ్మ, సన్నమ్మ ఇద్దరి పేర్లు ఒకే రేషన్ కార్డులో ఉండడం వల్ల ప్రభుత్వ అందించే సామాజిక పింఛను వరహాలమ్మకు మాత్రమే వస్తుంది. సన్నమ్మకు ఎటువంటి ఆధారం లేకపోవడంతో ఇటీవల ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించినప్పుడు తన పరిస్థితిని ఆయనకు విన్నవించారు. దీనికి స్పందించిన డిప్యూటీ సిఎం ప్రతి నెల తన వంతుగా వారి కుటుంబానికి పింఛన్ మాదిరిగా రూ.2750 అందించాలని తన కుమార్తె అయిన ప్రస్తుత జెడ్పిటిసి ఈర్లె అనురాధకు చెప్పారు. దీంతో బుధవారం చిన్ని వరహాలమ్మ సన్నమ్మ ఇంటికి వెళ్లి వారికి ఆర్థిక సాయం అందించారు. ఈ విధంగా ప్రతినెల ఒకటవ తేదీన సహాయం అందజేస్తామని జెడ్పిటిసి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, వైసిపి నాయకులు దాట్ల శివాజీ రాజు, ఏటుకూరు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న జెడ్‌పిటిసి అనురాధ

జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-సబ్బవరం

మండలంలోని బంగారమ్మ పాలెం గ్రామంలో ముత్యామాంబ అమ్మవారి పండగ ఈ నెల 9న జరగనున్న నేపథ్యంలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆ గ్రామ సర్పంచ్ దాడి లావణ్య కన్నం నాయుడు, ఎంపీటీసీ రాపేటి అరుణ రాము, మాజీ ఎంపీటీసీ దొడ్డి సూర్యప్రకాష్ బుధవారం ప్రారంభించారు. క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.25 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.15 వేలు, తృతీయ బహుమతిగా రూ.10 వేలు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈనెల 9న ఫైనల్స్ జరుగుతుందన్నారు.



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

నాణ్యమైన విద్యనందించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

విద్యాసంస్థలు లావాపేక్షతో కాకుండా సేవాభావాన్ని పెంపొందించుకుని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని అనకాపల్లి పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బివి సత్యవతి అన్నారు. మండలంలోని కూండ్రం గ్రామంలో బుధవారం శ్రీవెంకటేశ్వర విద్యానికేతన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు మంచి విద్యను అందించి వారి భవిష్యత్తును తీర్చిదిద్దాలని యాజమాన్యాన్ని కోరారు. అనంతరం ఎంపీ సత్యవతి విష్ణుమూర్తి దంపతులను యాజమాన్యం సత్కరించింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ భారతి, కరస్పాండెంట్ చిన్నారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



స్కూల్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ దంపతులు



మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఎంపిపి, జెడ్‌పి వైస్ చైర్‌పర్సన్

పాఠశాలలో తనిఖీలు

ప్రజాశక్తి-అనకాపల్లి

మండలంలోని కొత్తూరు శివారు ముదిరాజ్ కాలనీ ఎంపీపీ పాఠశాలను జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు బివి సత్యవతి, ఎంపిపి గొర్లి సూరిబాబు బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో పిల్లలకు కావలసిన వసతులు పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానం విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉందన్నారు. ఈ సందర్భంగా తరగతి గదులను, టాయిలెట్లను, మంచి నీటి వసతిని, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. మంచినీటి ట్యాంక్‌ను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు.



రక్తదాన అభినందన కార్డులు చూపుతున్న విద్యార్థులు

రక్తదానం మరొకరికి ప్రాణదానం

ప్రజాశక్తి-అనకాపల్లి

రక్తదానం మరొకరికి ప్రాణదానం వంటిదని సర్వేజన ఐక్యవేదిక వ్యవస్థాపకులు, నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోర్స్ ప్రతినిధి కోరిబిల్లి పరి అన్నారు. నైస్ మ్యాన్ పవర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో, సర్వేజనా ఐక్యవేదిక పర్యవేక్షణలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 50 మంది విద్యార్థులు పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో నైస్ మ్యాన్ పవర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత పిళ్లా రమేష్ బాబు, సిబ్బంది శంకర్, పవన్, సంజీవని తదితరులు పాల్గొన్నారు.

వృత్తి పట్ల నిబద్ధత కల్గిన ఉద్యోగి నాయుడు

ప్రజాశక్తి-చోడవరం

వృత్తి పట్ల నిబద్ధత కలిగిన ఉద్యోగి సిఎస్.నాయుడు అన్ని గోవాడ సుగర్ ఫ్యాక్టరీ ఎమ్‌డి వి.సన్యాసినాయుడు అన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఫీల్డ్‌మెన్, సుగర్ ఫ్యాక్టరీ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు పిఎస్ నాయుడు మృతికి సంతాప సూచికంగా బుధవారం ఫ్యాక్టరీ ఆవరణలో సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్‌డి సన్యాసినాయుడు మాట్లాడుతూ పిఎస్ నాయుడు విధి నిర్వహణలో అందరితో కలిసిమెలిసి ఉండేవారని తెలిపారు. ముక్కు సూటిగా వ్యవహరిస్తూ నిజాయితీ మనిషి పేరు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ రమణమూర్తి, సుగర్ ఫ్యాక్టరీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు సూరిబాబు, రాము నాయుడు, సీడీవో ఏ రామం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుగర్ ఫ్యాక్టరీ ఎమ్‌డి సన్యాసినాయుడు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తరలింపుపై నిరసన

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రజలకు అందుబాటులో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని జాతీయ రహదారి వద్దకు మార్చేందుకు చేస్తున్న నిర్ణయాన్ని తక్షణమే నిలిపివేయాలని కోరుతూ అఖిలపక్షాల ఆధ్వర్యంలో స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ, ఆమ్ ఆద్మీ, నేషనల్ కో ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ నాయకులు మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే ప్రాంతంలోనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని కొనసాగించాలని కోరారు. జాతీయ రహదారి బైపాస్ రోడ్‌లోకి మార్చడం వల్ల వృద్ధులు, వికలాంగులు, దూర ప్రాంతాల నుంచి వచ్చే రైతులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడమే కాక దొంగతనాలు జరిగే ప్రమాదం ఉందని తెలిపారు. తక్షణమే కార్యాలయ తరలింపును ఉపసంహరించుకొని ప్రజలకు అన్ని కార్యాలయాలు బ్యాంకులు అందుబాటులో ఉండే ప్రాంతంలో ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు వైఎన్ భద్రం, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు కొణతాల హరినాథ్ బాబు, నేషనల్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ నాయకులు సూదికొండ మాణిక్యాలరావు, చెల్లూరి నాగరాజు, సిహెచ్ శ్రీనివాసరావు బాబ్జి, రమణ, కోరిబిల్లి శంకర్రావు, కొణతాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న పలు పార్టీల నాయకులు


పశు దాణా అందజేస్తున్న హెరిటేజ్ జోనల్ మేనేజర్ దివాకరరావు

హెరిటేజ్ పాల సేకరణ ప్రారంభం

ప్రజాశక్తి అచ్యుతాపురం : మండలంలోని నడింపల్లి గ్రామంలో హెరిటేజ్ డెయిరీ పాల సేకరణ కేంద్రాన్ని ఆ డెయిరీ జోనల్ మేనేజర్ వి.దివాకర్‌రావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతుల సంక్షేమమే హెరిటేజ్ డెయిరీ లక్ష్యంగా సేవలందిస్తుందని చెప్పారు. డెయిరీ ఆధ్వర్యంలో పాడి రైతులకు పశువులకు అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాల గురించి తెలిపారు. డెయిరీ రీజనల్ మేనేజర్ పి నాగ అప్పారావు మాట్లాడుతూ అన్ని డెయిరీ కంటే హెరిటేజ్ పాలు సరఫరా చేస్తున్న రైతులకు అధిక రేట్లు చెల్లిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రైతులకు పశుధాన మినరల్ మిక్సర్ ప్యాకెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ కె శేషు, ఉప సర్పంచ్ పైడిరాజు, పాడి రైతులు అప్పారావు, కృష్ణ, పైడిరాజు, కనకరాజు, మహాలక్ష్మి, రమణమ్మ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : కార్మిక సంక్షేమ బోర్డును తక్షణమే పునరుద్ధరించాలని, లేకుంటే ప్రభుత్వాన్ని గద్దె దింపుతామని ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ సంఘం (ఏఐటియుసి) జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ హెచ్చరించారు. మండలంలోని మూలపేట గ్రామంలో బుధవారం సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు దశాబ్దాలుగా పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక సంక్షేమ బోర్డును ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. దేశంలో అనేక రాష్ట్రాల్లో కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే మన రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు ఆలం శంకర్, చిన్న, చిన్ని, మారేడుపూడి సత్యనారాయణ, పల్లా నరసింగరావు, ఉప్పులి సత్తిబాబు, ఆదినారాయణ, రాము నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కేంబ్రిడ్జ్ స్కూల్లో క్రాఫ్ట్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి -కశింకోట : కసింకోట కేంబ్రిడ్జ్ స్కూల్ యాజమాన్యం క్రాఫ్ట్ ఎగ్జిబిషన్, ప్రబిటి షో కేంబ్రిడ్జ్ స్పేస్ స్కూల్ అనే వినూత్న కార్యక్రమాన్ని బుధవారం చేపట్టింది. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ విలాసన్ మాట్లాడుతూ పిల్లల్లో ఉన్న ప్రతిభను చాటి చెప్పడానికి ఈ కార్యక్రమాన్ని రూపొందించున్నారు. ప్రతిరోజు ప్రార్థన సమావేశంలో పిల్లలు తయారు చేసిన క్రాఫ్ట్ వస్తువులను జాగ్రత్త చేసి వాటితో క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ నిర్వహించామని తెలిపారు. పనికిరాని వస్తువులతో రంగురంగుల కాగితాలతో అందమైన వస్తువులను విద్యార్థులతో తయారు చేయించామన్నారు. పిల్లల్లో దాగిన సృజనాత్మకతను వెలికి తీసి వారిని ప్రతిభావంతుల్ని చేయాలని తపనతో ఈ కార్యక్రమం ప్రారంభించబడిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి- మునగపాక రూరల్

మండల కేంద్రంలోని 1, 2 సచివాలయాలను ఎంపీడీవో రవికుమార్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలు, సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఆయుష్మాన్ భారత్‌ను పూర్తి చేయాలని కోరారు. రిజిస్టర్ ఏ విధంగా రాయాలో తెలియజేశారు. ప్రతి ఒక్కరూ ఆయా రంగాలకు సంబంధించిన యూనిఫామ్ కచ్చితంగా ధరించాలని ఆదేశాలు జారీ చేశారు.


రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంపిడిఒ రవికుమార్

పాఠశాలను సందర్శించిన డిప్యూటీ డిఇఒ

ప్రజాశక్తి-చోడవరం

స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలను అనకాపల్లి జిల్లా డిప్యూటీ డీఈవో యస్.ప్రేమ్ కుమార్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో పాఠశాలలో అమలు జరుగుతున్న అన్ని కార్యక్రమాలను పరిశీలించారు. ఉపాధ్యాయుల పాఠ్య ప్రణాళికలు, బోధనా డైరీలు, గ్రేడింగ్ రిజిస్టర్లు, బైజూస్ రికార్డులు, మధ్యాహ్న భోజన పథకం రికార్డులు, లిప్, టర్ల్ రికార్డులు, అన్ని తరగతుల విద్యార్థుల జ్ఞానం మరియు అవగాహనను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం నాణ్యతను, కంప్లైంట్ బాక్స్‌లను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసరావు, ప్రధాన ఉపాధ్యాయులు శేషగిరిరావు, శర్మ, కృష్ణ, సిఆర్‌పి కెవియమ్.నాయుడు పాల్గొన్నారు.


ఫిర్యాదుల పెట్టెను పరిశీలిస్తున్న డిప్యూటీ డిఇఒ

ఎమ్మెల్సీ ఎన్నికలకు 1082 మంది పోలీసులు

సిపి శ్రీకాంత్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ

విశాఖపట్నంలో ఎమ్మెల్సీ ఎన్నికల విధుల కోసం 1082 మంది పోలీసు సిబ్బందిని కేటాయించినట్లు పోలీస్ కమిషనర్ శ్రీకాంత్ తెలియజేశారు. బుధవారం ఆయన విశాఖ కలెక్టరేట్‌లో మీడియాతో మాట్లాడారు. పోలింగ్ రోజు 840 మందిని వినియోగిస్తున్నామన్న ఆయన పోలింగ్ లోకేషన్లు 43 ప్రాంతాలు, 112 పోలింగ్ స్టేషన్లతో పాటు 15 రూట్ మొబైల్ టీమ్‌లను కూడా ఏర్పాటు చేశామన్నారు. ప్రత్యేక దళాలు, జిల్లా స్ట్రైకింగ్ ఫోర్సును కూడా అందుబాటులో ఉంచామని తెలిపారు. ఎన్నికలు పూర్తయిన తరువాత స్ట్రాంగ్ రూమ్ వద్ద సెంట్రల్ పారామిలటరీ బలగాలను ఏర్పాటు చేశామన్నారు.కౌంటింగ్ డే రోజు అన్ని కేంద్రాల వద్ద ప్రత్యేక పోలీసు బలగాను మోహరించనున్నట్లు చెప్పారు.

ఫ్యాక్టరీ నష్టాలకు యాజమాన్యమే కారణం

ప్రజాశక్తి-చోడవరం : గోవాడ సుగర్ ఫ్యాక్టరీ నష్టాల్లో కూరుకుపోవడానికి యాజమాన్యమే కారణమని సుగర్ ఫ్యాక్టరీ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ఎస్.రాముునాయుడు ఆరోపించారు. ఫ్యాక్టరీ ఆవరణలో బుధవారం ఆయన కార్మికులనుద్దేశించి మాట్లాడుతూ కార్మికుల మధ్య తగాదాలు పెడుతూ యాజమాన్యం వ్యవహరిస్తున్న తీరు వల్ల ఫ్యాక్టరీకి నష్టం వస్తుందని చెప్పారు. సిడిఓ సరైన పద్ధతులు వ్యవహరించక పోవడం వల్ల ఫ్యాక్టరీకి చెరకు రాకుండా పోతుందన్నారు. దీంతో రోజుకు 4000 టన్నులు క్రషింగ్ చేయాల్సిన ఫ్యాక్టరీ తరచూ చెరకు లేక ఆగిపోతుందని తెలిపారు. గత రెండేళ్ల నుండి కో జనరేషన్ సరఫరా లేకపోవడం వల్ల 10 కోట్ల రూపాయలు నష్టం వచ్చిందని చెప్పారు. గుర్తింపు యూనియన్ కార్యదర్శి భాస్కర్‌రావు ఆదేశాలను యాజమాన్యం పాటిస్తుందని, దీనివలన కార్మికులకు, రైతులకు, ఫ్యాక్టరీకి నష్టం వాటిల్లుతుందని రాముునాయుడు ఆరోపించారు.

జగనన్న ఇళ్లు త్వరితగతిన పూర్తి

ప్రజాశక్తి-అనకాపల్లి

మండలంలో జగనన్న ఇళ్ల కాలనీలను త్వరితగతిన పూర్తి చేయాలని మండల పరిషత్ అధ్యక్షులు గొర్లి సూరిబాబు అధికారులకు సూచించారు. మండలంలోని తగరంపూడి గ్రామంలో నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్దిదారులకు కావలసిన సహాయ సహకారాలను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ధర్మారావు, హౌసింగ్ ఏఈ యుగంధర్, సర్పంచ యాదగిరి అప్పారావు, వైస్ ఎంపీపీ అయిత ఆనంద రాము, వెంకుపాలెం గ్రామ సర్పంచ్ రాపేటి నాగేశ్వరరావు, మామిడిపాలెం ఎంపిటిసి సభ్యులు అప్పలనాయుడు, గ్రామ కార్యదర్శి ఎస్తేర్, వెంకటేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరి దేవస్థానాన్ని సందర్శించిన విజయేంద్ర సరస్వతి

ప్రజాశక్తి -అనకాపల్లి : కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానాన్ని బుధవారం సందర్శించారు. ఈ నేపథ్యంలో పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బివి సత్యవతి విష్ణుమూర్తి దంపతులు, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, జిల్లా దేవాదాయ శాఖ అధికారి బుద్ద లక్ష్మి నగేష్, నూకాంబిక దేవస్థానం అర్చకులు ఆయన్ను కలిసి ఆశీస్సులు పొందారు. ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు ముందుగా పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో కన్యకా పరమేశ్వరి దేవస్థానం చైర్మన్ బిల్లపాటి కృష్ణ కుమార్, కార్యదర్శి కొరుప్రోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ ఉప్పల శ్రీనివాసరావు పాల్గొన్నారు.


శస్త్ర చికిత్సలకు బయలు దేరిన రోగులు

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - కె.కోటపాడు

వైఎస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో బుధవారం మండల కేంద్రంలోని శివాలయం వద్ద ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 90 మంది రోగులకు పరీక్షలు నిర్వహించగా అందులో 40 మంది కంటి ఆపరేషన్‌కు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రి సిబ్బంది వై.పైడిరాజు మాట్లాడుతూ 40 మందిని శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి తరలించి ఉచితంగా ఆపరేషన్ చేయించి తదుపరి పేషెంట్ ను వాళ్ల ఇళ్లకు పంపించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శంకర్ ఫౌండేష డిప్యూటీ జనరల్ మేనేజర్ బంగార్రాజు, క్యాంప్ మేనేజర్ కె.అప్పలరాజు. క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని ఉప్పవరం గ్రామంలో రూ.3 లక్షలు మండల పరిషత్ నిధులతో పాఠశాల ఆవరణలో చేపట్టనున్న అభివృద్ధి పనులను ఎం.జగన్నాధపురం ఎంపీటీసీ సభ్యులు రావి నాగలక్ష్మి చేతుల మీదుగా బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు చిన్ని శ్రీనివాసరావు, చిన్ని సత్యారావు, రాయి శోభన్ బాబు, టూజీ వైస్ సర్పంచ్ అడపా మహలక్ష్మి నాయుడు, పల్లి శ్రీను, దరియా, గంగిరెడ్డి భాస్కర్, కాయలు శ్రీను గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వేరే గ్రామంలో ఉన్న వ్యక్తికి పింఛను పంపిణీ

ప్రజాశక్తి- కశింకోట : అనారోగ్యం కారణంగా తన కుమార్తె ఇంటి వద్ద ఉన్న పింఛనుదారునికి వాలంటీర్ ఆ గ్రామానికి వెళ్లి పింఛన్ అందజేశారు. మండలంలోని ఈ.చౌడువాడ (కన్నూరుపాలెం) గ్రామానికి చెందిన పింఛనుదారుడు చుక్క దేముడు అనారోగ్యం కారణంగా నర్సీపట్నం మండలం గంగవరంలోని తన కూతురు ఇంటి దగ్గర ఉన్నారు. దీంతో ఈ.చౌడువాడ క్లస్టర్ 10 వాలంటీరు కన్నూరు యమున బుధవారం తన సొంత ఖర్చులతో గంగవరం వెళ్లి దేముడుకు పెన్షన్ అందజేశారు. సదరు వాలంటీరు కన్నూరు యమునను పంచాయతీ కార్యదర్శి యన్.సత్యారావు, సచివాలయ సిబ్బంది అభినందించారు.


పింఛను అందజేస్తున్న వాలంటీరు యమున

3, 8 తేదీల్లో

పలు చోట్ల కంటి వైద్యశిబిరాలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :స్థానిక షిరిడి సాయి మందిరం వద్ద ఈనెల 8న ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు షిరిడి సాయి సేవా సమాజ్ అధ్యక్షుడు కర్రి రామ్ గోపాల్ వెల్లడించారు. విలేకర్లతో ఆయన బుధవారం మాట్లాడుతూ, వైఎస్ఆర్ కంటి వెలుగు పథకం ద్వారా విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వైద్యుల పర్యవేక్షణలో నిర్వహిస్తామన్నారు. అవసరమైన వారికి ఉచిత ఆపరేషన్లు, కళ్ళజోళ్ళు సమకూరుస్తున్నామన్నారు.కంటి పరీక్షల అనంతరం ఆపరేషన్ అవసరమైన వారిని అదే రోజు ఉచితంగా శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి తరలించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఉద్యోగులు తమ మెడికల్ హెల్త్ కార్డు తప్పనిసరిగా తీసుకొని రావాలని ఆయన కోరారు. నర్సీపట్నం పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో షిరిడి సాయి సేవా సమాజ్ కార్యదర్శి వి రామచంద్రరాజు, కోశాధికారి లంక ఈశ్వరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గొలుగొండ:మండలంలోని గింజర్తి గ్రామంలో ఈ నెల 3న విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్, మాకవరపాలెం విజన్ ప్లస్ ఐ క్లినిక్, లింగందొరపాలెం గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఇక్కడ వివిద రకాల కంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలు అందించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:నియోజకవర్గంలో జన సేన సభ్యత్వాల నమోదు జరుగుతున్నాయని ఆ పార్టీ సమన్వయకర్త రాజాన వీర సూర్యచంద్ర విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,నర్సీపట్నం జనసేన పార్టీ నాయకులు అల్లు నరేష్ 100 మందితో సభ్యత్వ నమోదు చేయించారన్నారు.



దగ్ధమైన గడ్డివాము

తెగిపడిన విద్యుత్ వైరు

ఆవు మృతి, గడ్డివాము దగ్ధం

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని బిబి.పట్నం గ్రామ శివారు పంట పొలాల్లో బుధవారం సాయంత్రం విద్యుత్ వైరు తెగి పడటంతో ఆవు మృతి చెందింది. పక్కనే ఉన్న గడ్డి వాము కాలిపోయింది. దీంతో రైతు లబోదిబోమంటున్నాడు.

నేటి నుంచి వెంకన్న కల్యాణోత్సవాలు

ప్రజాశక్తి-నక్కపల్లి:ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకటేశ్వరస్వామి వార్షిక తిరు కల్యాణోత్సవాలు ఈనెల 2వ తేదీ నుంచి 10వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు అంగరంగ వైభవంగా వేడుకలు జరగనున్నాయి. రాష్ట్రం నలుమూలల నుంచి స్వామి కల్యాణం తిలకిం చేందుకు వేలాది మంది భక్తులు తరలిరానున్నారు. 2వ తేది గురువారం గ్రామ తిరువీధిలో ఉత్సవ కావిడితో అర్చక బృందం ఉత్సవాలకు శ్రీకారం చుడతారు. అశ్వవాహనంపై తిరువీధి సేవ నిర్వహిస్తారు. 3న ఉదయం 10 గంటలకు ధ్వజారోహణ, రథోత్సవం, కల్యాణమహోత్సవము జరుగుతుంది. 4న సర్వ దర్శనాలు, తిరువీధి సేవ, 5న తిరువీధి సేవ, 6న ప్రత్యేక పూజలు, . 7న చక్రస్నాన మహోత్సవం, 8,9,10 వతేదిల్లో పుష్పయాగోత్సవం నిర్వహిస్తారు. దీంతో వార్షిక కళ్యాణోత్సవాలు ముగుస్తాయి.



వెంకన్న కొండ

18 రోజుల తీర్థం

స్వామి వార్షిక కళ్యాణోత్సవాలు సందర్భంగా 18 రోజుల పాటు ఉపమాకలో తీర్థం జరుగుతుంది. పలు ప్రాంతాల నుంచి వచ్చిన చిల్లర వ్యాపారులు ఇక్కడ తాత్కాలింగా కమ్మలు పాకలు వేసుకుని దుకాణాలు ఏర్పాటు చేసుకుని పలు వ్యాపారాలు చేసుకుంటారు. చిన్న చిన్న బొమ్మలు దుకాణాలతోపాటు, తోపుడు బండ్లు, మిఠాయి కొట్టులు తీసుబండరాలు దుకాణాలు ఏర్పాటు చేసుకుంటారు. మసాలా దినిసుల వ్యాపారం ఇక్కడ ప్రత్యేకం. స్వామివారి వార్షిక కళ్యాణోత్సవాలకు సంబంధించి టిటిడి ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు తెలిపారు.

ఘనంగా ధ్వజస్తంభం ప్రతిష్ట

హాజరైన ఉప ముఖ్యమంత్రి బూడి

ప్రజాశక్తి-మాడుగుల:మండల కేంద్రంలోని గవర వీధి రామాలయం ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు పాల్గొని రూ.10వేల విరాళం అందించారు. మాజీ ఎమ్మెల్యే టిడిపి నేత గవిరెడ్డి రామానాయుడు రూ.10 వేల రూపాయల విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు లెక్కల కాశిబాబు, రంజిత్ వర్మ, సూర్యనారాయణరాజు, బిశెట్టి మోది నాయుడు, పైడినాయుడు, సంతోష్, స్వామి పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఉప ముఖ్యమంత్రి బూడి

బాధితుడికి రూ.5వేలు వితరణ

ప్రజాశక్తి - చీడికాడ :దండిసురవరం గ్రామానికి చెందిన వేపాడ శ్రీనివాసరావు రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో బుధవారం మాడుగుల నియోజకవర్గ టిడిపి నాయకులు పైలా ప్రసాదరావు రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు. బాధితుడిని స్వగృహం వద్ద పరామర్శించి తన వంతు సహాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో దిబ్బపాలెం ఎంపీటీసీ దారపు పెద్దినాయుడు, మండల పార్టీ కార్యదర్శి బొబ్బాది తాతరావు, మాజీ స్కూల్ కమిటీ చైర్మన్ కోన అప్పారావు, మాజీ సర్పంచ్ వేపాడ నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ వేపాడ భూలోకం, గండిం సత్యారావు, పైలా యువసేన సభ్యుడు వేపాడ వరహాల నాయుడు, సయ్యపురెడ్డి గణేష్ తదితరులు పాల్గొన్నారు.



నగదు ఇస్తున పైలా ప్రసాదరావు

8న వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని పాకలపాడు గ్రామంలో తలుపులమ్మ తల్లి పండుగ సందర్భంగా వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నామని నిర్వాహకులు పేర్కొన్నారు. మొదటి బహుమతి రూ.24999, రెండవ బహుమతి రూ.11999, బెస్ట్ స్పైకర్‌కు రూ.1199 అందజేస్తామన్నారు. ఎంట్రీ ఫీజు రూ.1199 చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.



లేగ దూడలను పరిశీలిస్తున్న ప్రసాద్‌రావు

లేగ దూడల ప్రదర్శన

ప్రజాశక్తి- చీడికాడ :మండలంలోని జైతవరం గ్రామంలో లేగ దూడల ప్రదర్శనను జిల్లా పశుసంవర్ధక శాఖ సంచాలకులు బి.ప్రసాద్‌రావు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసాద్ రావు మాట్లాడుతూ, పెయ్యి పుట్టిన వెంటనే వాటికి ముర్రుపాలు తాగించాలని, ప్రతి నెల పాముల మందు పట్టించాలన్నారు. ఆడ పెయ్యలు పుట్టాలంటే కొత్త పథకం (పేయ్య దొడల ఉత్పత్తి పథకం)ద్వారా రైతులు ఉపయోగించవచ్చు అన్నారు. పశువులకు పాడి పెయ్యలకు నాలుగు సంవత్సరాలు దాటిన తర్వాత గాలి కుంటి వ్యాధి రాకుండా, టీకాలు వేయించుకోవాలన్నారు. పశుగణాభివృద్ధి సంస్థ సంచాలకులు రామ్మోహన్‌రావు మాట్లాడుతూ, కృత్రిమ గర్భధారణను రైతులందరూ వినియోగించుకోవాలని, పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకుని రైతులు ఆర్థికంగా అభివద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక సహాయ సంచాలకులు డాక్టర్ వి.చిట్టి నాయుడు, వైద్యులు భాను, గాయత్రీ దేవి, అనుపమ, గణేశ్వరరావు, మణి లక్ష్మణ్, అరుణ్ కిరణ్, పాడి రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రెల్లి మహిళా హక్కుల కమిటీ సభ్యులు

యువకుడిని అరెస్టు చేయాలి

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని మహిళా సంఘం ప్రతినిధులు అనకాపల్లి జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రెల్లి మహిళా హక్కుల సాధన కమిటీ అధ్యక్షురాలు నిరపల్లి లలితకుమారి, కార్యదర్శి పిల్లా జ్యోతి నర్సీపట్నంలో విలేకరులతో మాట్లాడుతూ, దళిత మహిళ బంగారు లక్ష్మిని ప్రేమ పెళ్లి పేరుతో మోసం చేసి ముఖం చాటేసిన అగ్రకులానికి చెందిన మాకవరపాలెం మండలం బయ్యవరం గ్రామానికి చెందిన అనిమిరెడ్డి ఆనంద్ కుమార్, అతని తల్లి తులసీపై ఎలమంచిలి టౌన్ పోలీస్ స్టేషన్ లో అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు పట్టించుకోలేదన్నారు. గత నెలలో వీరిపై అట్రాసిటీ కేసు నమోదైతే ఇంత వరకు అరెస్టు చేయకుండా పోలీసులు నిందితులకు కొమ్ము కాస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే అరెస్టు చేసి బాధితులకు న్యాయం చేసి రక్షణ కల్పించాలని లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు.



మధ్యలోనే నిలిచిన ఆర్‌బికె, వెల్నెస్ సెంటర్

నిలిచిన నిర్మాణాలు

ప్రజాశక్తి -కోటవురట్ల:మండల కేంద్రంలో మండల పరిషత్ ఆవరణలో నిర్మితమవుతున్న రైతు భరోసా, వెల్నెస్ సెంటర్ల నిర్మాణాలు నిలిచి పోయాయి. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించ తలపెట్టిన రైతు భరోసా కేంద్రానికి మండల కేంద్రంలోని ఇటువంటి పరిస్థితి నెల కొంది. మండల కేంద్రంలో ప్రస్తుతం పరాయపంచన (వెలుగు కార్యాలయం లో) కొనసాగుతోంది. అదేవిధంగా ఆరోగ్య కేంద్రం అద్దె కొంపలో సాగుతోంది. నిర్మాణాలకు సకాలంలో బిల్లులు రాక పోవడంతో పనుల జాప్యం జరుగుతుందని నిర్వాహకులు ఆవేదన చెందుతున్నారు.

నేను ఎక్కడికి పోనూ.. ఇక్కడే ఉంటా

ఎమ్మెల్యే బాబూరావు సంచలన వ్యాఖ్యలు

ప్రజాశక్తి-కోటవురట్ల:నేను ఎక్కడికి పోనూ ఇక్కడే ఉంటా అడ్డరోడ్డు దగ్గరే ఉంటా!, కార్యకర్తలకి నిరంతరం అందుబాటులోనే ఉంటానంటూ ఎమ్మెల్యే గొల్ల బాబురావు పునరుద్ఘాటించారు. బుధవారం కైలాస పట్నం గ్రామంలో జడ్పిటిసి సభ్యురాలు ఉమాదేవి ఇంటి వద్ద ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో బాబురావు ఆయన చేసిన వ్యాఖ్యలు పట్ల సర్వత్రా చర్చనీయాంశం అయ్యింది. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశానికి మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల నుంచి కార్యకర్తలు, నాయకులు హాజరు కాకపోవడం పట్ల మండల వ్యాప్తంగా చర్చ కూడా కొనసాగింది. ఇదిలా ఉండగా రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే సీటు పై అధిష్టానం నుండి స్పష్టమైన హామీ లేక పోవడంతో ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారని కార్యకర్తలు భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో అన్నవరం వెంకటాపురం, కొడవటిపూడి, చౌడువాడ , లింగాపురం, ఎండపల్లి, కైలాస పట్నం, కోటవురట్ల గ్రామాలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే



ప్లాంట్ ను ప్రారంభిస్తున్న కంపెనీ ప్రతినిధులు

హెటిరో ఆధ్వర్యాన
మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని ఉపమాక పంచాయతీ శివారు అయ్యన్నపాలెంలో హెటిరో డ్రగ్స్ కంపెనీ సౌజన్యంతో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. బుధవారం కంపెనీ ప్రతినిధులు ఎం.ప్రభాకర్, ఎం.సుబ్బారెడ్డి, ఎస్.కల్లాయిరెడ్డి చేతుల మీదుగా ఆర్వో ప్లాంట్ ను ప్రారంభించారు. గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను తమ దృష్టికి తీసుకు రావడంతో 13 లక్షల రూపాయలతో వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేయడం జరిగిందని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. .సిఎస్ఆర్ ఫండ్స్‌తో గ్రామాల్లో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జానకయ్యపేట మాజీ సర్పంచ్ కురుందాసు నూకరాజు, సెక్యూరిటీ డిపార్ట్మెంట్ మూర్తి, హెటిరో సిబ్బంది శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడి టీచర్ మృతి

ప్రజాశక్తి-రావికమతం: మండల కేంద్రంలో అంగనవాడి టీచర్ అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. స్థానికుల వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన అమరకంటి సత్యవతి అంగనవాడి కేంద్రం 4లో గత కొన్ని ఏళ్లుగా విధులు నిర్వహిస్తుంది. ఆమె అనారోగ్యంతో మృతి చెందారు.

నిందితులను అరెస్టు చేయాలి

ప్రజాశక్తి-పాయకరావుపేట: మండలంలోని పి.లక్ష్మీపురం గ్రామంలో మంగళవారం అదే గ్రామానికి చెందిన వడ్డమూరి నాగేందర్ అనే దళిత యువకుడిపై దాడి చేసి హత్య చేసిన అగ్రకులస్తుల్ని తక్షణమే అరెస్టు చేయాలని దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ సందర్భంగా కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి, దళిత సంఘాల ఐక్యవేదిక సంఘం అధ్యక్షులు చెట్ల చలపతి, నాయకులు, మల్లేష్, సహదేవుడు మాట్లా డుతూ, దళితులపై రోజు రోజుకీ దాడులు పెరిగి పోతున్నాయని, వీటిని అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. నాగేందర్ ను హత్య చేసిన నలుగురిని మాత్రం అరెస్టు చేశారని, మిగతా వారిని కూడా అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుని, రక్షణ కల్పించాలని కోరారు.

యుటిఎఫ్ కార్యవర్గం ఎన్నిక
అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నారాయణ, బాలకృష్ణ

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని ఎలిమెంటరీ పాఠశాల ఆవరణలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.మహేష్, జిల్లా కార్యదర్శి కే.రఘునాథ్‌ల ఆధ్వర్యంలో యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా ఎల్ నారాయణరావును, ప్రధాన కార్యదర్శిగా శెట్టి బాలకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా టి.సుబ్బారావు, ఉపాధ్యక్షులుగా ఎస్ శ్రీరామ్, జి.కాంతమ్మ, కోశాధికారిగా కే.ఆనందరావు, కార్యదర్శులుగా కె.ప్రసాద్, వి.మల్లయ్య, కె.రాజారావు, ఎం.రామకృష్ణ, ఎం.మోహన్, బి.శ్రావణ్ కుమార్, కె బాబ్జి, జి.భులక్ష్మి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా టి.కోరేష్, కే సీతన్న, జిల్లా కౌన్సిలర్లుగా ఎం.బాబూరావు, ఎస్ కన్నయ్య, పి.చంద్రశేఖర్, ఎం.పార్వతి, పి.అర్జున్, మహిళా అధ్యక్షురాలుగా ఆర్.పార్వతమ్మ, సిపిఎస్ కన్వీనర్‌గా జి.దుక్కులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా ఎన్నికైన నారాయణ, బాలకృష్ణ మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటామని తెలిపారు.

సమస్యలపై పోరాడే పిడిఎఫ్ అభ్యర్థి...
కోరెడ్ల రమాప్రభను గెలిపించండి
-గోదావరి జిల్లా ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు- పలు చోట్ల ముమ్మరంగా ప్రచారం



సంయుక్త స్కూల్ కరస్పాండెంట్ గోవిందరావును కరపత్రాన్ని ఇస్తున్న రమాప్రభ, వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న, వాటి పరిష్కారానికి పోరాడుతున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియం, రింగ్ రోడ్, బెల్లం మార్కెట్ తదితర ప్రాంతాల్లో వాకర్స్‌ను కలిసి కోరెడ్ల రమాప్రభకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఎమ్మెల్సీతో పాటు పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ, ప్రజా సంఘాల నాయకులు సంయుక్త స్కూల్ కరస్పాండెంట్ గోవిందరావును కలిశారు. పలు విద్యా సంస్థల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రంలో అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపిలు వంత పాడుతున్నాయని తెలిపారు. విశాఖ రైల్వే జోన్ కోసం, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మిక, ప్రజా సంఘాలతో కలిసి పిడిఎఫ్ ఎమ్మెల్సీలే పోరాడుతున్నారని చెప్పారు. 250 ప్రజా సంఘాల బలపర్చుతున్న కోరెడ్ల రమాప్రభ ఉత్తరాంధ్ర ప్రజలు గొంతై ఇక్కడి సమస్యలపై గళమెత్తుతారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బి.ఉమామహేశ్వరరావు, గంట శ్రీరామ్, ఎ.బాలకృష్ణ, గంట సురేష్, ఎస్ రమణ, గొర్లి తరుణ్ పాల్గొన్నారు.

నక్కపల్లి: పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు కోరారు. మండలం లో బుధవారం పలు గ్రామాల్లో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమా ప్రభను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శాసనమండలిలో పట్టభద్రులు, నిరుద్యోగుల, ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపైన పిడిఎఫ్ ఎమ్మెల్సీలు తమ గళాన్ని వినిపిస్తున్నారన్నారు. శాసనమండలి సభ్యులకు ఇచ్చిన కోట్లాది రూపాయలు విలువ చేసే ఇల్లు, స్థలాలను పిడిఎఫ్ శాసనమండలి సభ్యులు తిరస్కరించి, రాష్ట్రంలో ఇల్లు, స్థలాలు లేని పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షులు ఎం.రాజేష్, నాయకులు ఎం.మహేష్ బాబు, బి.అప్పలరాజు, కె.కాశీ, ఎం.జాన్, ఎం.బాపూజీ, అంజి, అప్పలరాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

తగరపువలసలో ప్రజాసంఘాల ప్రచారం

తగరపువలస : ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ బుధవారం స్థానిక ప్రజాసంఘాల ప్రతినిధులు తగరపువలసలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఓటర్లను కలిసి, కరపత్రాలను అందజేసి, రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ప్రచారంలో సిఐటియు నాయకులు రవ్వ నరసింగరావు, ఎన్.శ్రీనివాసవర్మ, సోమి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేయుచున్న కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరుతూ మండలంలోని హరిపాలెం గ్రామంలో బుధవారం సాయంత్రం ప్రజాసంఘాల ప్రతినిధులు ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పట్టభద్రులను కలిసి రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల ప్రతినిధులు కె.రామసవాశివరావు ఎస్ కనుమునాయుడు, ఎం సూర్య రామ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో...

పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు మద్దతుగా బుధవారం అచ్యుతాపురంలో సిఐటియు మండల కార్యదర్శి కె సోమ నాయుడు ఆధ్వర్యాన విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వ్యాపారులను నిరుద్యోగులను ఉద్యోగులను కార్మికులను కలిశారు. పిడిఎఫ్ బలపరిచిన రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

డుంబ్రిగూడ: ఉత్తరాంధ్ర పట్టబద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ గిరిజన సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని అరకు పంచాయతీలో ప్రచారం నిర్వహించారు. సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎస్‌బి పోతురాజు, గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు టి.సూర్యనారాయణ మాట్లాడుతూ, ప్రజా సమస్యలపై శాసనమండలిలో గొంతెత్తి ప్రశ్నించే పిడిఎఫ్ అభ్యర్థులకు ఓటేసి గెలిపించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు పి.సురేష్ కుమార్, పి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



డుంబ్రిగుడలో కరపత్రాలను ఇస్తున్న నాయకులు

వంట గ్యాస్ ధరలను తగ్గించాలి



ఆందోళన చేపడుతున్న సిఐటియు నాయకులు, మహిళలు

ప్రజాశక్తి - కలెక్టరేట్: బిజెపి ప్రభుత్వం వంటగ్యాస్ ధరలను పెంచుతూ చేసిన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం సాయంత్రం పూర్ణ మార్కెట్ దుర్గాలమ్మ గుడి జంక్షన్‌లో సిఐటియు జగదాంబ జోన్ కమిటీ ఆధ్వర్యంలో వినూత్న నిరసన తెలిపారు. కట్టెల పొయ్యపై మహిళలు వంట చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జోన్ నాయకుడు కె.చంద్రశేఖర్ మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం అన్నింటి ధరలను పెంచి ప్రజల జీవితాలను అతలాకులం చేస్తుందని విమర్శించారు.. ముఖ్యంగా వంట గ్యాస్ ధరలను భారీగా పెంచి ప్రజలపై భారం వేసిందన్నారు. మోడీ ప్రభుత్వం అధికారానికి రాకముందు వంట గ్యాస్ ధర రూ.450 ఉండగా ఇప్పుడురూ.1250 కి పెరిగిందన్నారు. జీఎస్టీ విధించడంతో అన్ని నిత్యావసర వస్తువులు ధరలు కూడా పెరిగాయన్నారు. డీజిల్, పెట్రోల్, వంటగ్యాస్ వంట నూనెల ధరలు కూడా విపరీతంగా పెరగడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఇంతగా భారాలు కేంద్రం మోపుతుంటే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, జనసేన నాయకుడు పవన్ కళ్యాణ్ లు మోడీని నిలదీయలేని పరిస్థితి నెలకొందన్నారు. ఈ పరిస్థితుల్లో ధరభారాలు తగ్గాలంటే, పోరాటం చేయక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జోన్ నాయకులు టి.పైడిరాజు, కెవిపి చంద్రమౌళి, ఎం. సుబ్బారావు, మహిళా నాయకులు కండిపిల్లి వరలక్ష్మి, సిహెచ్ పైడిరాజు పాల్గొన్నారు.

కలెక్టరేట్: కేంద్రం ప్రభుత్వం వంట గ్యాస్ ధరలను పెంచడాన్ని నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ఆర్టీసీ కాంప్లెక్స్ దరి గురజాడ అప్పారావు విగ్రహం ముందు గ్యాస్ బండకు ఉరి వేసుకొని వినూత్నమైన నిరసన చేపట్టింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడుతూ ఇప్పటికే నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్న తరుణంలో మరో మారు వంటగ్యాస్ ధరలను పెంచి వినియోగదారులపై ఆర్థికభారం మోపడం దుర్మార్గం అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సి.ఎన్ క్షేత్రపాల్, ఎం. మన్మధరావు, జి.కాసులరెడ్డి, వై.రాంబాబు, ఎ.ఆదినారాయణ, ఎన్.అప్పన్న, యు.నాగరాజు పాల్గొన్నారు.